క్లుప్తంగా

అయ్యప్పస్వాముల మహా పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న స్వాములు

డోన్ టౌన్ : అయ్యప్ప దీక్ష చేపట్టిన మాలధారులు బుధవారం ఇరుముడి ధరించి కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్పస్వామి సన్నిధానానికి పాదయాత్రగా బయలు దేరి వెళ్లారు. పట్టణానికి చెందిన మాధవకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురుస్వామి, శంకర్, పుల్లయ్య, దేవేంద్ర, రామకృష్ణ, నవదీప్, శ్రీనివాసులు, నాగరాజు, రాజశేఖర్ ఆచారి తదితరులు స్థానిక తత్వమసి అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముడి ధరించి పాదయాత్ర ప్రారంభించారు. వారిని ఇతర స్వాములు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. వీరు 30 రోజుల పాటు పాదయాత్ర చేసి జనవరి నెలలో సంక్రాంతి రోజు శబరిమలైలో జ్యోతి దర్శనానికి చేరుకుంటారు.

అందుబాటులో క్షయ వ్యాధి మందులు



శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్‌కు నివాళులర్పిస్తున్న ప్రభుత్వాసుపత్రి వైద్యులు

డోన్ : ప్రభుత్వ వైద్యశాలలో టీబీ వ్యాధిని సమూలంగా నయం చేసేందుకు అన్నిరకాల మందులు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ అనురాధ అన్నారు. క్షయ వ్యాధికి కారణమైన మైకో బ్యాక్టీరియా ట్యూబర్ క్యులోసిస్‌ను కనుగొన్న శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్ జయంతి సందర్భంగా స్థానిక వంద పడకల ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి డాక్టర్ అనురాధతో పాటు వైద్యులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు రమ్యశిల్ప, సుకుమార్, యమున, కళ్యాణ్, ప్రసాద్, హెడ్ నర్సులు హేమలత, ఇంద్రజ, తులసి, సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

14న గురుదత్త జయంతి

అవుకు: గురుదత్తాత్రేయ జయంతి మహోత్సవ వేడకలను అవుకులో ఈనెల 14న ఘనంగా నిర్వహించనున్నట్లు అవుకు షిరిడీ సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. 14వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 8గంటలకు సాయి మందిరం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోనిగోవిందిన్నె గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఈడిగ సుంకన్నగౌడ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. ఈడిగ సుంకన్నగౌడ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకొని 11 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గీతా జయంతి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన శ్రీహట్టిమునిస్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ, విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రణవ పతాక ఆవిష్కరణ, గోమాతకు పూజ చేశారు. అనంతరం మధ్యాహ్నం గీతా గ్రంథం, శ్రీ కృష్ణ భగవానుడికి అభిషేకం, తులసి, బిల్వపత్రాలు, పుష్పాలతో సామూహిక అర్చన తదితర పూజలు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి అధ్మాత్మిక సభ జరిగింది. కార్యక్రమంలో గురూజీ రామశేషయ్య, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మమ్మ, సుధాకర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీసుధ విద్యాలయంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహికంగా విద్యార్థుల చేత భగవత్ గీతా పారాయణం చేయించారు. అనంతరం శ్లోకాల పఠనం పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు తొగట సురేష్‌బాబు, వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మలిశెట్టి జగన్‌మోహన్,ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు బహుమతులను అందజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని కోవెలకుంట్ల రహదారిలో ఉన్న ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి జయ రాముడు(60)అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు ఇల్లూరుకొత్తపేటకు చెందిన జయరాముడు పనినిమిత్తం మోటార్ సైకిల్‌పై బనగానపల్లె సాయంత్రం వచ్చారు. రాత్రి స్వగ్రామానికి బయల్దేరగా ఐటీఐ సమీపంలోని ఆర్ఆర్ ఫంక్షన్ తహాల్ వద్ద మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఆయనను చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లింగమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది.

కూటమి సర్కార్‌ను నిలదీద్దాం

- ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిరంతర పోరాటాలు
- 13న రైతు సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఉదయానంద ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపు





ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, డోన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

బనగానపల్లె రూరల్ : ప్రజా వ్యతిరేక విధనాలు అవలంభిస్తున్న కూటమి సర్కార్‌ను ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలదీస్తామని, ఈ మేరకు చేపట్టే నిరంతర పోరాటాలకు ప్రతిఒక్కరూ మద్దతు తెలుపాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వ తీరును నిలదీస్తూ ఈ నెల 13వ తేదీన నంద్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నామన్నారు. ముందుగా ఉదయానంద ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో కలిసి భారీ నిరసన ర్యాలీ చేపడుతున్నామని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక స్వగృహంలో రైతు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కాటసాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఐదు నెలలాయిన రైతులకు ఇచ్చిన ఏ ఒక్కహామీ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఖరీఫ్ సీజన్ పూర్తయి, రబీ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం అందజేయలేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకంగా రూ. 20 వేలు అందజేస్తామంటూ ఎన్నికల ముందు మభ్యపెట్టిన సీఎం చంద్రబాబు ఆ ఊసే ఎత్తని తీరును ప్రతిఒక్కరూ నిలదీయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా కొట్టుమిట్టాడుతున్న రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఖరీఫ్‌లో అరకొర వచ్చిన దిగుబడులకు సైతం గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతియేటా సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేశారని, ధరలస్థిరీకరణ పథం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందన్నారు. గతంలో వరి ధాన్యం క్వింటాం రూ.2,600– 2,700 వరకు రైతులకు గిట్టుబాటు ధర లభించడం జరిగిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో క్వింటాం రూ.1,400–1,500 చొప్పున ఉందన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులకు గత వైఎస్సార్‌సీపీ హయంలో ఉచిత బీమా అమలు అయ్యిందని, ఏ సీజన్‌కు ఆ సీజన్‌లోనే నష్టపోయిన రైతులకు బీమా మొత్తం చెల్లించామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత పంట బీమా పథకం రద్దు చేసి ఆ భారం రైతుల పైనే వేయడం సిగ్గుచేటని విమర్శించారు.

అన్ని వర్గాలకు అన్యాయం

కూటమి సర్కార్ ఆరు నెలల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయమే జరుగుతోందని, సీఎం చంద్రబాబు నాయుడు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని ధ్వజమెత్తారు. వ్యవసాయం, వైద్య, విద్య రంగాలను పూర్తిగా విస్మరించిన కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ప్రజల తిరుగుబాటు చవిచూస్తారని హెచ్చరించారు. దివంగత వైఎస్ రాజాశేఖర్‌రెడ్డి పాలనలో ఎస్సీ,ఎస్టీ కాలనీలకు 50 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడం జరిగిందని, ఈ పథకాన్ని ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం సీఎం చంద్రబాబు సర్దుబాటు అంటూ విద్యుత్ చార్జీల పెంపునకు సిద్ధం అయ్యారన్నారు. గత వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని, కూటమి ప్రభుత్వం చేస్తున్న దగా, మోసాల ను ప్రజలకు తెలియజేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13న రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలు చేపడుతుందని చెప్పారు. ఈ మేరకు జిల్లా కేంద్రం నంద్యాలలో నిర్వహించే ధర్నాకు ప్రతిఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, మెట్టుపల్లి ఉప సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి. మనోహర్‌రెడ్డి, లారీ కరీం తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని మరోసారి మోసగించిన చంద్రబాబు

డోన్ : రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ప్రజలకు హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి దారుణంగా మోసగించారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో బుధవారం ఆయన డోన్, బేతంచెర్ల ఎంపీపీలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 13వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదురుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే రైతాంగం పోరుబాటలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు.

నమ్మితే నట్టేట ముంచారు

2014 ఎన్నికల సందర్భంగా రైతులకు రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు అనంతరం ఎగనామం పెట్టిన విషయాన్ని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుర్తుచేశారు. 2024 మళ్లీ కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలోకి తెచ్చేందుకు రైతులకు పెట్టుబడి సహాయం కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తానని మాయమాటలు చెప్పి అధికారం చేజిక్కించుకున్నారన్నారు. అయితే ఖరీఫ్ ముగిసి రబీ వచ్చినా పెట్టుబడి సహాయం అందక రైతులు ఆర్థికంగా చితికిపోయారన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఉచిత పంటల బీమాకు ఎగనామం పెట్టారని విమర్శించారు. అంతేకాకుండా రైతులకు అండగా ఉండేందుకు ఏర్పాటు రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సోమేష్ యాదవ్, మద్దిలేటి స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సీతారామచంద్రుడు, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, కోఆప్షన్ మెంబర్ రఫీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు మోగిన నగారా



డోన్ మండలం గుమ్మకొండ గ్రామంలో గోడలకు నోటిఫికేషన్ అతికిస్తున్న రెవెన్యూ సిబ్బంది

డోన్ టౌన్ : సాగునీటి సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్లను సంబంధిత గ్రామ పంచాయతీల్లో, గ్రామాల్లో గోడలకు అతికించారు. ఈ నెల 14వ తేదీ సంబంధిత గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆర్డీఓ కేపీ నరసింహులు తెలిపారు. డోన్ రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలో మైనర్, మేజర్ ఇరిగేషన్ చెరువులు, ప్రాజెక్టుల కింద ఉన్న 47 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి, ఊటకొండ, వెంగళాంపల్లి సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఎన్నికలను ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహిస్తామన్నారు. నామినేషన్ల స్వీకరణ, పోటీ చేసేవారి తుది జాబితా విడుదల, ఎన్నికతో పాటు ఫలితాలు ఒకే రోజు నిర్వహిస్తామన్నారు. 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

బేతంచెర్ల : మండలపరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో ఈనెల 14వ తేదీన సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ ప్రకాశ్ బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉదయం 8 గంటలకు గోర్లగుట్ట మైనర్ ఇరిగేషన్ ట్యాంకు సంబంధించిన సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలో మొత్తం 92 మంది రైతులు ఉన్నారన్నారు.

కొలిమిగుండ్ల: సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండుసార్లు వాయిదా పడుతూ వస్తున్న ఎన్నికలకు ఎట్టకేలకు ఈనెల 14న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో మొత్తం ఐదు చెరువులు ఉన్నాయి. ఒక్కో చెరువుకు ఒక మండల స్థాయి అధికారిని ఎన్నికల అధికారిగా నియమించారు. పోలింగ్‌లో ఓటర్లుగా ఉన్న సభ్యులు టీసీలను ఎన్నుకుంటారు. అనంతరం సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. తిమ్మనాయినపేట చెరువు పరిధిలో 1,277 మంది ఓటర్లు, అబ్దులాపురం దెయ్యాల చెరువుకు 54 మంది, కొలిమిగుండ్ల సద్దలవెంగన్న చెరువుకు 144 మంది, హనుమంతుగుండం పెద్ద చెరువుకు 300, చిన్న చెరువుకు 329 మంది ఓటర్లు ఉన్నారని ఆయా నీటి సంఘాల ఎన్నికల అధికారులు తెలిపారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎస్సార్బీసీకి సంబంధించి మండలంలోని జోళదరాశి, గుళ్లదూర్తి, బిజనవేముల, సౌదరదిన్నె గ్రామాల్లో, కేసీకెనాల్‌కు సంబంధించి కలుగొట్ల, రేవనూరు గ్రామాల పరిధిలో ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. తనతోపాటు ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, ఏఓ నిరంజన్, ఉద్యానవనశాఖ అధికారిణి ధరణి, ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని వివరించారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ప్యాపిలి: బాల్య వివాహాల కారణంగా ముక్కుపచ్చలారని బాలికల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్ బేగం అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బందికి కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాలికలను ఉన్నతంగా చదివిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు అవగాహన లేక పలు కారణాలతో బాల్య వివాహాలను చేస్తున్నారని, అంగన్‌వాడీ టీచర్లు బాల్య వివాహాల గురించి సమాచారం వస్తే వెంటనే స్పందించాలన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, సూపర్‌వైజర్లు శోభారాణి, పద్మావతి పరమేశ్వరి, రాధమ్మ, అరుణకుమారి, దేవకృప, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి చేయూత



మృతుని కుటుంబానికి నగదు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న స్నేహితులు

కోవెలకుంట్ల: చిన్నతనంలో తమతోపాటు చదువుకున్న స్నేహితుడి కుటుంబానికి మిత్రులు చేయూతనిచ్చారు. ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. కోవెలకుంట్లకు చెందిన చిన్న వెంకటరమణారావు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గత నెల 30న బస్సుకింద పడి మృత్యువాత పడ్డాడు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో వెంకటరమణారావుతోపాటు పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ప్రమాద సంఘటను తెలుసుకున్నారు. తమ స్నేహితుడి కుటుంబానికి చేయూత నివ్వాలని భావించి బుధవారం రూ. 60 వేల నగదుతో పాటు బియ్యం, కందిపప్పు, తదితర నిత్యావసర సరుకులను మృతుడి భార్య రాజేశ్వరికి అందజేశారు. భవిష్యత్తులోనూ స్నేహితుడి కుటుంబానికి భరోసాగా ఉంటామని పేర్కొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల : సొంత స్థలం ఉన్న అర్హులైన పేదలందరికీ ఇల్లు మంజూరు చేసి, సొంత ఇంటి కలను నెరవేరుస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సొంత స్థలం ఉన్న వారికి పట్టణ ప్రాంతంలో రూ. 2.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.80 లక్షలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని హనుమాన్ నగర్ ఎంపీపీ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. అదేవిధంగా మండలపరిధిలోని కనుమ కింది కొట్టాల వద్ద ఉన్న బిల్ల స్వర్గం గుహలను ఎమ్మెల్యే సందర్శించారు.

ఉపాధి పనుల్లో లక్ష్యాలను సాధించాలి

ప్యాపిలి: ఉపాధి హామీ పనుల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ, ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానికంగానే ఉంటూ ఉపాధి పనుల ద్వారా రూ.300 వరకు కూలీ పొందవచ్చనే విషయాన్ని కూలీలకు తెలియజేయాలన్నారు. ఫీల్డు అసిస్టెంట్లు ప్రతిరోజూ పనులను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో కోర్సు డైరెక్టర్ ఏసుదాసు, ఏపీఓలు రమణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

18న దివ్యాంగుల సమావేశం

బనగానపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 18న బనగానపల్లె నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు బి మద్దిలేటి తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. దివ్యాంగులు ఎదుర్కుంటున్న 22 రకాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐకమత్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో దివ్యాంగుల జేఏసీ నాయుకులు చెన్నయ్య,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భారతి అన్నారు. మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో తహసీల్దార్‌కు అందజేశారు. సర్వే నంబర్ 322-1ఏలోని 2.98 ఎకరాల పొలం రెవెన్యూ రికార్డుల్లో డి పట్టాగా నమోదైనట్లు రామకృష్ణారెడ్డి అనే రైతు తెలిపాడు. సదరు పొలం తనకు పూర్వీకుల నుంచి వచ్చిందని దాదాపు 30 సంవత్సరాలుగా తాను సాగులో ఉన్నట్లు తెలిపాడు. అధికారులు విచారణ చేపట్టి రెవెన్యూ రికార్డుల్లో తమ పేరును నమోదు చేయాలని కోరాడు. కార్యక్రమంలో ఆర్ఐ సుజాతా బాయి, వీఆర్వోలు రామనాయుడు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలి

బనగానపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో వసుధ ఫౌండేషన్ సహకారంతో అనారోగ్యానికి గురైన ముగ్గురికి రూ.30వేల చెక్కులను ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య ఆధ్వర్యంలో బీసీ రాజారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ విద్యా వైద్యరంగంలో వసుధ ఫౌండేషన్ సంస్థ పేదలకు అందిస్తున్న సహాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది నాగేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు, మౌలీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నక్కి శ్రీకాంత్ ఎన్నికపై హర్షం

డోన్ టౌన్ : సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా నక్కి శ్రీకాంత్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా నందికొట్కూరు పట్టణంలో జరిగిన సీపీఎం రెండవ జిల్లా మహాసభల్లో నూతనంగా ఏర్పడిన జిల్లా కమిటీలో డోన్ పట్టణానికి చెందిన నక్కి శ్రీకాంత్‌కు స్థానం కల్పించారని సీపీఎం మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు చిన్న రహిమాన్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్, ఆవాజ్ కమిటీ జిల్లా నాయకులు అక్బర్ బాషా తెలిపారు.

ప్రతి కుటుంబానికి వంద పనిదినాలు

- డ్వామా పీడీ జనార్దనరావు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జనార్ధనరావు

కోవెలకుంట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతి కుటుంబానికి వంద పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ జనార్దనరావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు అన్ని కుటుంబాలు వంద పనిదినాలు పూర్తి చేసుకునేలా పనులు చూపించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ప్రతి కూలికి రోజుకు రూ. 270 నుంచి రూ. 280 సగటు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ఉద్యానవన పంటల బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, ఏపీఓ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కృష్ణుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల : స్థానిక నంద్యాల రహదారిలో వెలసిన గోపాలకృష్ణ బృందావనంలో గీతాజయంతి వేడుకలను హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గోపాల కృష్ణ బృందావనంలోని శ్రీ కృష్ణుడికి విశ్వ హిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహకన్వీనర్ నాగ మోహన్, హిందూ ధార్మిక సంఘాల ముఖ్య నాయకులు హుసేన్‌రెడ్డి, గుండా గోపాలు, గూని నాగరాజు, వెంకట్, రామచంద్రుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తిని కొలువుంచి పట్టణ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప, భవాని మాలధారులతో పాటు భక్తులు వీరారెడ్డి, శ్రీనివాసులు, శేఖరయ్య, పద్మనాభుడు, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

సంజామల: మండల కేంద్రం సంజామల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి ఆర్‌జీఎస్ శిక్షణా తరగతుల నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బందికి ఆర్‌జీఎస్ కార్యాచరణ 2024–2025 ప్రణాళికపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

బేతంచెర్ల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈనెల 12, 13 తేదీల్లో ఒక బ్యాచ్, 17,18వ తేదీల్లో రెండవ బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ బుధవారం తెలిపారు.

మద్దిలేటిస్వామి ఆలయానికి విరాళం

బేతంచెర్ల : మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి బనగానపల్లె మండలం పసుపుల గ్రామానికి చెందిన బైసాని అనంత్‌కుమార్, లక్ష్మి ప్రియ దంపతులు రూ.100,116 విరాళాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషన్, ఈఓ రామాంజనేయులుకు అందజేశారు. ఈసందర్భంగా దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

15న దత్తాత్రేయ స్వామి జయంతి

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడులో వెలసిన పద్మనాభ స్వామి ఆశ్రమంలో ఈ నెల 15న దత్తాత్రేయస్వామి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. జయంతిని పురస్కరించుకుని స్వామివారికి అభిషేకం, హోమం, గురుపూజ, పల్లకీసేవ, అన్నదాన వితరణ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

డోన్ టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ విగ్రహావిష్కరణకు వేలాదిగా తరలిరావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న అమ్మ హోటల్ (రైల్వే స్టేషన్)సమీపంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బేతంచెర్ల : మండలపరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలోని తెలుగు బాపిస్టు కృపాలయం చర్చిలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రసంగి, చర్చి నిర్వాహకులు కేక్ కట్ చేశారు. పాస్టర్లు సజీవరాజు, బాలరాజు, విక్టర్, ఐజక్ సన్నీ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సంతాపం

బేతంచెర్ల : మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బావికాటి మోహన్ రెడ్డి తల్లి పార్వతమ్మ (85) అనారోగ్యంతో మరణించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డిలు పార్వతమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.